

30లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి: జేడీ

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంటల బీమాకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఈనెల30 లోగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ జేడీ భారతి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో 15,94,000 కమతాల్లో 4,11,000 ఎకరాల్లో ఈ-పంట నమోదైందని పేర్కొన్నారు. 2,72,000 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 97,000 ఎకరాల్లో ఉద్యాన పంటలు నమోదైనట్లు తెలిపారు. 3,58,199 ఎకరాల్లో సోషల్ ఫారెస్టు భూములు, గడ్డి భూములు, చేపలు చెరువులు, ప్రభుత్వ భవనాలు, లేఅవుట్లు, రోడ్లు ఉన్నాయని పేర్కొన్నారు.

ఎస్.కోట ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం

- కిడ్నీ వ్యాధి బాధితులకు తప్పనున్న వ్యయప్రయాసలు
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే లలితకుమారి



శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి

శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కానుంది. వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ మంగళవారం ఈ మేరకు ప్రకటించారు. కిడ్నీ వ్యాధి బాధితులకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. వారికి వ్యయప్రయాసలు తప్పుతాయి. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలతో పాటు గజపతినగరం నియోజకవర్గ పరిధిలోని గంట్యాడ మండల ప్రజలు ఎక్కువగా ఈ ఆసుపత్రినే ఆశ్రయిస్తుంటారు. డయాలసిస్ కోసం విశాఖ నగరానికి వెళ్తున్నవారంతా ఇకనుంచి ఎస్.కోట రావొచ్చు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌లకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

శృంగవరపుకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఏడు డయాలసిస్ కేంద్రాల్లో జిల్లా పరిధిలోని శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి ఒకటి కేటాయించారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని సీతంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోనూ ఏర్పాటు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ మంగళవారం వీటిని ప్రకటించారు. ప్రతి కేంద్రంలోనూ రోజూ మూడు సెషన్ల ద్వారా 15 మందికి రక్తశుద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన మంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రం (పీఎంఎన్డీపీ) కింద ఏర్పాటు కానున్న ఈ కేంద్రానికి ఒక్కో చోట రూ.75లక్షల విలువైన మూడు రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలు సమకూర్చుతారు. ప్రస్తుతం రాష్ట్రంలో (మిగతా 8వ పేజీలో..)



శివ పూజకు వేళాయె

- నేటి నుంచి పవిత్ర కార్తీక మాసం ప్రారంభం
- పూజలు, అభిషేకాలకు సిద్ధమైన శివాలయాలు
- విద్యుత్ దీపాలతో ముస్తాబు



విజయనగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నియమనిష్ఠలతో, భక్తి ప్రపత్తులతో శివుని ఆరాదించే కార్తీకమాసం బుధవారం ప్రారంభమవుతోంది. ఇక ఈ నెల రోజులూ భక్తులు మాంసాహారానికి, ఇతర అలవాట్లకు దూరంగా ఉంటూ ఆ మంజునాథుని పూజిస్తారు. ఈ నెలలో వచ్చే కార్తీక ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి ఎంతో విశిష్టమైనవి. ఈ రోజుల్లో భక్తులు ప్రత్యేక పూజలు, నోములు ఆచరిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున దేవాలయాల వద్ద జ్వాలాతోరణం చేపడ్తారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శివాలయాలు కార్తీక మాసా నికి సిద్ధమయ్యాయి. పుణ్యగిరితో పాటు విజయనగరంలోని వీరరాజేశ్వర స్వామి ఆలయం, ఉమారామ లింగేశ్వర స్వామి ఆలయం, రామతీర్థంలోని శివాలయం, దిబ్బేశ్వరస్వామి, ధర్మవరం సన్యాసేశ్వరస్వామి ఆలయం, మెంటాడ మండలం జయతి గ్రామంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిరంతరం జరుగనున్నాయి.

- కార్తీకమాసంలోనే పిక్నిక్ సందడి కూడా మొదలు కానుంది. ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించి అదే చెట్టు కింద సహపంక్తి భోజనాలు చేయడం సంప్రదాయం. ఈ విధానంలో నేడు అనేక మార్పులు వచ్చేశాయి. ఏదైనాగాని కార్తీక వన సమారాధనలు కూడా ఇకనుంచి ప్రారంభం కానున్నాయి.

ఉద్యోగులకు ఊరట



- డీఏ ప్రకటనతో భారీ ఉపశమనం
- జిల్లాలో 22,205 మందికి రూ.3.10 కోట్ల లబ్ధి
- 150 మంది ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు
- పోలీస్ శాఖలో ఆర్జిత సెలవులు
- నగదుగా మార్చుకొనే అవకాశం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

ఉద్యోగులకు ప్రభుత్వం వరం ప్రకటించింది. డీఏ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. నవంబరు నెలలో అందించే జీతంతో పాటు డీఏ మొత్తాన్ని జమ చేయనుంది. దీనిపై ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ నిర్ణయంతో జిల్లాలో 22,205 మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. పోలీస్ శాఖ ఉద్యోగులకు ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం కూడా కల్పించింది.

విజయనగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

ఉద్యోగ సంఘాల నేతలతో కేబినెట్ సబ్ కమిటీ ఇటీవల సమావేశమైన విషయం తెలిసిందే. తమ సమస్యలను ఉద్యోగ సంఘాల నేతలు మంత్రులకు వివరించారు. అదే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మంత్రులు వివరించారు. అయినా సరే ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే సీఎం చంద్రబాబు ఉద్యోగులకు డీఏ ప్రకటించారు. పోలీస్ శాఖ ఉద్యోగులకు సంబంధించి ఎర్న్‌లీవుల అలవెన్సులు సైతం అందించనున్నట్టు చెప్పారు. నవంబరులో 50 శాతం, జనవరిలో 50 శాతం అందిస్తామని ప్రకటించారు. తాజా పరిణామంపై ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు 22,205 మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఏ ప్రకటనతో వీరందరికీ ప్రయోజనం చేకూరనుంది. ఒక్కో ఉద్యోగికి కనిష్ఠంగా రూ.1000 నుంచి రూ.3000 వరకూ లబ్ధి చేకూరనుంది. సగటున రూ.1400 వరకూ ప్రయోజనం పొందే అవకాశం ఉంది. జిల్లాలో ఉద్యోగులకు రూ. 3.10 కోట్ల మేర ఆర్థిక లబ్ధి కలగనుందన్న మాట. వాస్తవానికి ఉద్యోగులకు నాలుగు డీఏలు చెల్లించాల్సి ఉంది. జగన్ సర్కారు ఒక్క డీఏ కూడా ప్రకటించలేదు. ఇప్పుడు డీఏ విడుదల చేసిన ప్రభుత్వం.. మున్ముందు మిగతా డీఏలను సైతం విడుదల చేస్తామని ప్రకటించింది. దీంతో ఉద్యోగులు ప్రభుత్వంపై సానుకూలంగా ఉన్నారు. అయితే పీఆర్సీ ప్రకటన రాకపోవడంపై మాత్రం కాస్త నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ వరకూ చైల్డ్‌కేర్ సెలవులు

సాధారణంగా మహిళా ఉద్యోగులకు సెలవులు అనేది కీలకం. కుటుంబాల్లో మహిళల ప్రసవం నుంచి పిల్లల వివాహాలు, వారి ప్రసవాలు, అనారోగ్య, అత్యవసర సమయాల్లో సెలవులు పెట్టాల్సిన అవసరం ఉంటుంది. అలా చైల్డ్‌కేర్ సెలవులు అనేవి ఉద్యోగి సర్వీసులో 18 ఏళ్లకే ముగిసేవి. మెడికల్ (మిగతా 8వ పేజీలో..)

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం..

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దశాబ్దాలుగా ఆర్టీసీ ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. జగన్ సర్కారు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిందే తప్ప ఉద్యోగులకు ఒక్క ప్రయోజనం కల్పించలేకపోయింది. ప్రభుత్వ ఉద్యోగులని చెప్పి చాలా రకాల అలవెన్సులు నిలిపివేసింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు అమలు చేస్తున్నారు. ఈ నిర్ణయంతో జిల్లాలో 150 మంది వరకూ సీనియర్ ఉద్యోగులకు పదోన్నతులు కలగనున్నాయి. వారి కేడర్ మారుతుంది. జీతం కూడా పెరుగుతుంది.



ఉయ్యాల కంబాల సేవలో అమ్మవారి ప్రతిమతో అర్చకుడు

వైభవం.. ఉయ్యాల కంబాల ఉత్సవం

- నేడు చండీహోమం..
- ముగియనున్న పైడిమాంబ భక్తుల దీక్షలు

విజయనగరం రూరల్/ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవంలో చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవం పురస్కరించుకుని నగరంలోని పైడిమాంబ చదురుగుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. పిండివంటలతో కూడిన ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం 4.45 గంటలకు సుప్రభాత సేవ అనంతరం భక్తులకు పైడిమాంబ దర్శనాన్ని కల్పించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు, తొలేళ్ల ఉత్సవం, సిరిమానోత్సవం రోజు అమ్మవారిని దర్శించుకోవడానికి వీలుకాని భక్తులంతా ఉయ్యాల కంబాల సందర్భంగా దర్శించుకునేందుకు రావడంతో చదురుగుడి, వనంగుడి భక్తులతో కోలాహలంగా కన్పించాయి. ఉయ్యాల కంబాల రోజు కూడా నేలవేషాలు, పులివేషాలు సందడి చేశాయి. రాత్రి 7.30 గంటలకు ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు చదురుగుడి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉయ్యాలలో పైడిమాంబ ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష పర్యవేక్షణలో ఆలయ అధికారులు ఉత్సవ ఏర్పాట్లు చేశారు. కాగా అమ్మవారి ఆలయంలో బుధవారం చండీహోమం జరుగనుంది. ఇదే రోజు పైడిమాంబ భక్తులంతా దీక్షలను విరమించనున్నారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు, (ఇన్‌సెట్)లో పైడిమాంబ

పోలీస్ అమర వీరుల సేవలు చిరస్మరణీయం

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి
- స్మృతి వనంలో ఘన నివాళి



అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, జిల్లా న్యాయాధికారి బబిత, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (మిగతా 8వ పేజీలో..)



బాణసంచా వ్యాపారం రూ.40 కోట్లు

- రూ.12కోట్లు మాత్రమే టర్నోవర్ చూపించిన వ్యాపారులు

విజయనగరం, రింగురోడ్డు అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందడి సందడిగా సాగింది. పిల్లలు, పెద్దలు, యువత భాగస్వామ్యంతో హోరెత్తింది. బాణసంచా వ్యాపారం కూడా వ్యాపారులకు భారీ లాభాన్ని తెచ్చి (మిగతా 8వ పేజీలో..)

7లో

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- గెడ్డల్లోని ఇసుక స్థానిక అవసరాలకే: కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో మృతి

- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఘటన

కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల దీక్షలు

మరో అడుగు

- త్వరలో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్ర భవనాల పనులు
- భూమిని కేటాయిస్తూ తాజాగా జీవో విడుదల
- భూమి విలువ రూ.139 కోట్ల 47 లక్షలుగా నిర్ధారణ



గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి అందజేసిన భూములివే

కొత్తవలస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస మండలంలో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు దిశగా మరో కీలక అడుగు పడింది. గిరిజన యూనివర్సిటీకోసం గతంలో కేటాయించిన 516 ఎకరాల 58సెంట్ల భూమిని గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రానికి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీవో నెంబర్ 384ను విడుదల చేసింది. దీంతో భవనాల పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

కొత్తవలస మండలంలోని రెల్లి రెవెన్యూలో సర్వేనెంబరు 367-1,368 నుంచి 374 మరియు 376 నుంచి 379 సర్వేనెంబరు 81-1,2 లలో 516 ఎకరాల 58 సెంట్లు ప్రభుత్వ భూములను గతంలో రెవెన్యూ శాఖ గిరిజన యూనివర్సిటీ కోసం (మిగతా 8వ పేజీలో..)

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

వంగర, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో జీవనరాణి ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు కనీస సదుపాయాలు అందే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో నిర్వహించాల్సిన తనిఖీలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

నేడు విద్యుత్ నిలుపుదల

గజపతినగరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో గల చల్లపేట ఫీడర్ వద్ద చెట్టు కొమ్మల తొలగింపుతో పాటు మరమ్మతుల కారణంగా మండలంలోని 11 గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు బొబ్బిలి డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగచోళ్లపెంట, పట్రువాడ, కొత్తబగ్గాం, పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బూడపేట, కోనిస, సాలిపేట, చిటయ్యవలస గ్రామాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

లక్కవరపుకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చందులూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వై.చరణ్‌కుమార్, కార్తీక్, ఎర్రమ్మలు అనే ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈనెల 22, 23 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హాజరవుతారని చెప్పారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

స్టాకు ఉంచొద్దు

భోగాపురం, అక్టోబరు 21(భోగాపురం): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన స్టాకు ఎప్పటికప్పుడే పంపిణీ చేస్తుండాలని, నిల్వ ఉంచకూడదని ఐసీడీఎస్ భోగాపురం ప్రాజెక్టు అధికారి లావణ్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ వర్కర్లకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు, ఆయాలు నిర్ణీత సమయాల్లో కేంద్రాల్లో ఉండాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వసతిగృహం తనిఖీ

వేపాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొండగంగుబూడి బాలుర వసతిగృహాన్ని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం సందర్శించారు. వార్డెన్ సురేష్ ఆధ్వర్యంలో చేస్తున్న వంటను రుచిచూశారు. వసతిగృహానికి ఎమైనా అవసరమైతే తనను కోరవచ్చన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. దాసరి కార్పొరేషన్ చైర్మన్ రత్నాజీ, పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల శ్రీను, మాజీ సర్పంచ్ వెంకటరావు పాల్గొన్నారు.


సీసీ కెమెరాల ఏర్పాటు

రాజాం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు యలకల సురేష్ సమకూర్చిన ఎనిమిది సీసీ కెమెరాలను మంగళవారం ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సీఐ దగ్గరుండి ఏర్పాటు చేయించారు. ఏఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

నేడు మంత్రి రాక

మెంటాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బుధవారం మెంటాడ మండలంలో పర్యటించనున్నారు. కొండలింగాలవలస నుంచి గజంగుడ్డివలస వరకు రూ.కోటి 50లక్షల అంచనా వ్యయంతో మంజూరైన బీటీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేయనున్నారు.

శివయ్యకు కిరణ స్పర్శ



రాజాం/ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభమైన వేళ.. సోమవారం రెండు వేర్వేరు శివాలయాల్లో శివలింగాలకు సూర్యుని కిరణాలు తాకాయి. రాజాం మండలం గురవాంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు రాజాం పట్టణంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో ఈ అద్భుతం చోటుచేసుకుంది.

అమృత హస్తం పథకానికి విరాళం

చీపురుపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కొంత మంది సామాజిక సేవా కార్యకర్తలు నడుపుతున్న అమృత హస్తం అన్నదాన పథకానికి మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు మనుమడు వేలూరి అమోఘ్ రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-1లో ఎంపికై కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా ఉద్యోగం పొందిన సందర్భంగా ఆయన ఈ విరాళాన్ని అందజేశారు. సోమవారం ఆసుపత్రి వద్ద ఆయన ఈ మొత్తాన్ని పథక నిర్వాహకుడు బీవీ గోవిందరాజులుకు అందజేశారు. గద్దే బాబూరావు, ఆయన సతీమణి గద్దే వెంకటనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలి

భోగాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వారితో కలిసి స్థానిక ఎంపీడీవో డీడీ స్వరూపరాణికి వినతిపత్రం అందజేశారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- గెడ్డల్లోని ఇసుక స్థానిక అవసరాలకే..
- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలు జరగకుండా చూడాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చిన్న చిన్న నదులు, గెడ్డల్లో అనుమతి పొందిన థర్డ్ ఆర్డర్ రీచుల్లో దొరుకుతున్న ఇసుక ఆయా గ్రామాల అవసరాలకు మాత్రమేనని, ఇతర ప్రాంతాలకు రవాణా చేయడానికి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. వారికి ఇస్తున్న కూపన్లపై తప్పనిసరిగా తేదీ, పంచాయతీ కార్యదర్శి సంతకం ఉండాలన్నారు. ఇలాంటి రీచుల్లో ఎక్కడా ఇసుక తవ్వకానికి మిషన్లు వాడకూడదని, వాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇస్తానుసారం ఇసుక తవ్వకాలు చేయకుండా, అనుమతి పొందిన 48 థర్డ్ ఆర్డర్ ప్రదేశాల్లోనే ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఇసుక లభ్యత, డిమాండ్‌పై సమీక్షించారు. ఈసందర్భంగా జేసీ సేతు మాదవన్ మాట్లాడుతూ థర్డ్ ఆర్డర్ రీచ్‌లు 48 ఉన్నాయని, రెండు స్టాకు పాయింట్ల ద్వారా నాణ్యమైన ఇసుకను శ్రీకాకుళం జిల్లా నుంచి తెప్పించి అందుబాటులో ఉంచామని వివరించారు. గనుల శాఖ డీడీ సీహెచ్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో ఏడాదికి సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుందని, ఈ మేరకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కొత్తవలస వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ప్రతిపాదన పెండింగ్‌లో ఉందని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ థర్డ్ ఆర్డర్ రీచ్‌ల జాబితాను తహసీల్దార్లు, పోలీసులకు అందజేయాలన్నారు. డీసిల్టింగ్ పూర్తయిన చోట, నాణ్యత తక్కువతో లభించే ఇసుకను ఫిల్లింగ్‌కు వినియోగించేలా చూడాలని సూచించారు. అలాగే అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలపై దృష్టి పెట్టాలన్నారు. జేసీ సేతు మాధవన్, డీటీసీ మణికుమార్, మైన్స్ డీడీ సూర్యచంద్రరావు, ఆర్డీవోలు కీర్తి, ఆశయ్య పాల్గొన్నారు.

- ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూపు, చైల్డ్ రైట్స్ ఫోరం రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. మిషన్ వాత్సల్య పథకం అమలులో భాగంగా రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ, సమీక్ష, జిల్లా, గ్రామ స్థాయి శిశు సంక్షేమ, పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలన్న నిబంధనల మేరకు పరిరక్షణ కోసం బాలల సంక్షేమ పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఐసీడీఎస్ పీడీ విమలరాణి, చైల్డ్ రైట్స్ ఫోరం కన్వీనర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

వంద పరిశ్రమల స్థాపనే ధ్యేయం

- ఎమ్మెల్యే నాగమాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గంలో వంద పరిశ్రమలు స్థాపించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. మంగళవారం డెంకాడ వెలుగు కార్యాలయంలో ఎంఎస్ఎంఈ సౌజన్యంతో ఏర్పాటుచేసిన పారిశ్రామికవేత్తల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతులను పాటించి 78 రకాల ఉత్పత్తులతో వంద పరిశ్రమలు స్థాపించే విధంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిరాకిల్ సీఈవో లోకం ప్రసాదు మాట్లాడుతూ ప్రతి పంచాయతీ నుంచి పారిశ్రామికవేత్తలను తయారు చేయడం తమ లక్ష్యమన్నారు. ఎంపీపీ బి.వాసుదేవరావు, ఎంపీడీవో భవాని, దాడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

విజయనగరం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు పురపాలక సేవలను మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పుర మిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని దాని ద్వారా మున్సిపల్ సేవలు, ఫిర్యా దులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, నివాస ధ్రువీ కరణ పత్రాలతో పాటు 122 పుర సేవలను పొందవచ్చన్నారు.

ఇసుక తవ్వకాలపై చర్యలు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాటిపూడి వద్ద నూతనంగా నిర్మించిన వంతెన వద్ద ఇసుక తవ్వకాలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'ఆగని ఇసుక తవ్వకాలు' అనే వార్త ప్రచురితమయ్యింది. దీనిపై కలెక్టర్ రామసుందర్‌రెడ్డి స్పందించారు. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించడంతో తహసీల్దార్ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి వెళ్లి, తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. తమ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఆర్ఐ మనోజ్‌కుమార్, వీఆర్వో నాయుడు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్యం సీసాల తొలగింపు

భోగాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భోగాపురం సచివాలయం సమీపంలో గల రైతు సేవా కేంద్రంలో ఉన్న మద్యం సీసాలను ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం తొలగించారు. ఈనెల 20న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన రైతు సేవా కేంద్రంలో మద్యం సీసాలు' అనే కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఈ మేరకు అక్కడికి చేరుకుని.. గుట్టలుగా పోగులు వేసిన మద్యం సీసాలను తొలగించారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

చీపురుపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయపురంలో మంగళవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. చీపురుపల్లి నుంచి గరివిడి వైపు బైకుపై వెళ్తున్న పట్టణానికి చెందిన తలచుట్ల శ్రీను అనే వ్యక్తిని ఆంజనేయపురం సమీపంలో విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన శ్రీను గాయాలపాలయ్యాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే అదితి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విజయనగరం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల స్థాయి అనుబంధ కమిటీల పార్టీ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా పార్టీ కమిటీల్లో అవకాశం పొందినవారు తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు ఐవీపీ రాజు, గంటా పోలినాయుడు, గంటా రవి, విజ్జూ ప్రసాద్, నర్సింగ్‌రావు, గాడు అప్పారావు, బేగం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఎల్.కోట: చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 43 మందికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి సుమారు రూ.28 లక్షలు మంజూరయ్యింది. ఈ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు పంపిణీ చేశారు. జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



భోగాపురం: చెక్కులు అందజేస్తున్న బంగార్రాజు

- భోగాపురం: పేదలు కష్ట సుఖాల్లో కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మంగళవారం పోలిపల్లి గ్రామంలో ఆయన రూ.3.35 లక్షలు విలువగల సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేశారు.

కుళాయి కనెక్షన్లలో అవకతవకలపై చర్యలు చేపట్టాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపట్టిన ఇంటింటి కుళాయి కనెక్షన్ల అవకతవకలపై దర్యాప్తు చేపట్టి, చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 350 గ్రామాలకు కుళాయి కనెక్షన్ల సదుపాయం కల్పించినట్టు జల్‌జీవన్ మిషన్ వెబ్‌సైట్‌లో పేర్లతో సహా చూపించారని, అయితే కేవలం 50-60 శాతం మాత్రమే ఆ గ్రామాల్లో ఏర్పాటు చేశారని అన్నారు. కుళాయి సదుపాయం కల్పించినట్టు ప్రభుత్వ రికార్డుల్లో చూపిస్తున్న పేర్ల జాబితాను, గ్రామాల్లో అందరికీ తెలిసే విధంగా సచివాలయంలో సభను ఏర్పాటు చేసి నిజ నిర్ధారణ చెయ్యాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల తీరుపై దళితుల ఆగ్రహం

లక్కవరపుకోట: మండలంలో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటి కుళాయి పేరుతో ఎక్కడపడితే అక్కడ సీసీ రోడ్లు, డ్రైన్లు తవ్వేసి వదిలి వెళ్లిపోయారని.. దీంతో నానా అవస్థలు పడుతున్నామని తామరాపల్లి గ్రామానికి చెందిన దళితులు మంగళవారం రోడ్డెక్కారు. ఏ గ్రామంలో చూసినా రోడ్లు, కాలువలు చిందరవందరగా ఉన్నాయని ఆందోళన వ్యక్త చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. తామరాపల్లిలో దళితవాడకు వెళ్లడానికి దారిలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

నెల్లిమర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు 104 వాహనం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.పీసీపీపీ సాయిరాం సూచించారు. కొండలగాడ పీహెచ్‌సీ పరిధిలోని పూతికపేట గ్రామంలో ఉన్న 104 వాహనాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. వాహనంలోని వైద్య పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా.. లేదా.. అని పరిశీలించి ఏరోజు ఎక్కడ వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంతమంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందిస్తున్నారన్న విషయాలపై ఆరా తీశారు. అనంతరం వాహనంలోని మందులు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాహన సిబ్బంది జగన్మోహన్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న చర్చిలపై చర్యలు తీసుకోవాలని హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.వేణుగోపాలరావు, బీజేపీ మండల అధ్యక్షుడు షైపాడ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నెల్లిమర్ల తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీతోపాటు రూరల్ మండలంలోని గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా చర్చిలు వెలుస్తున్నాయని చెప్పారు. అలాగే ఈనెల 14న నెల్లిమర్ల గ్రామదేవత పూడమ్మతల్లి చదురు గుడి, రామమందిరం వద్ద హిందూ దేవుళ్లను దూషించి మత మార్పిడిలకు పాల్పడిన గోస్పెల్ ఆఫ్ కింగ్‌డమ్ చర్చి పాస్టర్ ఇమ్మాన్యుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. హిందూ ధర్మ రక్ష సమితి జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు, ఎన్‌వీ కృష్ణారావు, లీగల్ సెల్ ప్రతినిధి పి.గణపతిరావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణమూర్తి ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి

భోగాపురం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. మంగళవారం భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జోనల్ స్థాయి అండర్-17 బాల బాలికల వాలీబాల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో 180మంది బాలు రు, 40 మంది బాలికలు పాల్గొనగా.. జిల్లా స్థాయి పోటీలకు 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. సాఫ్ట్‌బాల్ సెక్రటరీ శేఖర్, డివిజన్ స్థాయి స్పోర్ట్స్ ఇన్‌చార్జి తవిటయ్య, వ్యాయామ ఉపా ధ్యాయుడు కేవీఏఎన్ రాజు, మండల ఇన్‌చార్జి సిగిడి నాగన్న పాల్గొన్నారు.


అమర వీరుల సేవలు వెలకట్టలేనివి



పోలీసు అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

డెంకాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల సేవలు వెలకట్టలేనివని ఐదో పోలీసు బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు అన్నారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా చింతలవలస వద్ద గల పోలీసు బెటాలియన్ ఆవరణలో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈసందర్భంగా అమరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందజేశారు. అడిషనల్ కమాండెంట్ జీవీ ప్రభాకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.బాపూజీ, ఎం.గోపాలకృష్ణ, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష



రిలే దీక్షలో నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల తీరు రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ఉందని జిందాల్ నిర్వాసితులు అన్నారు. మంగళవారం బొడ్డవారలో వారు 124 రోజు నిరసనలో భాగంగా రిలే దీక్ష కొనసాగించారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి, ఎంపీ వంటివారు తమ సమస్యలను ముఖ్యమంత్రికి వివరించకుండా నొక్కిపెడుతున్నారన్నారు.

- మండలంలోని నాలుగు పంచాయతీల గిరిజన, హరిజన, మైనార్టీలు 18 ఏళ్ల కిందట జిందాల్ పరిశ్రమకు భూములు ఇచ్చి, మోసపోయారు.. వారు గత నాలుగు నెలలుగా శాంతియుత పోరాటం చేస్తుంటే కలెక్టర్ ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రశ్నించారు. మంగళవారం బొడ్డవర గ్రామంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత కలెక్టర్‌కు మాత్రమే ఉందని, షేర్ల పంపిణీ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు వంటివి కలెక్టర్ చూడాలని.. అయితే ఇవేమి జిల్లా అధికారులకు పట్టకపోవడం దారుణమన్నారు.

పెళ్లయిన ఏడాదికే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పెళ్లయిన ఏడాదికే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలంలోని కొండగండ్రేడు గ్రామానికి చెందిన రేజేటి పాపినాయుడు(28) ఆదివారం బైకుపై వెళ్తుండగా ఫకీరుకిట్టలి జంక్షన్ సమీపంలో అదుపుతప్పి పడిపోయాడు. క్షతగాత్రుడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య మౌనిక ఉంది. మృతునికి వివాహమై సంవత్సరం కావస్తోంది. ఆదివారం భార్యకు సీమంతం చేసి సాయంత్రం సరదాగా బైకుపై బయటకు వెళ్లిన పాపినాయుడు ఈ ప్రమాదానికి గురయ్యాడు. పాపినాయుడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అర్ధాంతరంగా మృతిచెందడంతో భార్య, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఆనందపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం-పెందుర్తి జాతీయ రహదారిలోని మామిడిలోవ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సీఐ చింతావాసునాయుడు మంగళవారం తెలిపారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణంరాయుడుపేటకు చెందిన పాలిక లక్ష్మణ్ (28), భార్య పాలిక నూకరత్నం (22) పెందుర్తి సమీపంలోని కరకవానిపాలెంలో నివాసముంటున్నారు. వీరిద్దరూ ఆనందపురం జంక్షన్‌లోని పువ్వులు కొనుగోలు చేయడానికి ద్విచక్రవాహనంపై సోమవారం తెల్లవారుజామున బయలుదేరారు. పెందుర్తి నుంచి ఆనందపురం జంక్షన్‌కు సర్వీసు రోడ్డులో వస్తుండగా.. మామిడిలోవ సమీపంలో ఉన్న కోకోకోలా కంపెనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా అతివేగంగా వస్తున్న వ్యాన్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న పాలిక నూకరత్నంకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త లక్ష్మణ్‌కు బలమైన గాయాలయ్యాయి. సంఘటనా స్థలంకు చేరుకున్న పోలీసులు నూకరత్నం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తీవ్ర గాయాల పాలైన లక్ష్మణ్‌ను చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కుమిలి వద్ద వీఆర్వో..

పూసపాటిరేగ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమిలి గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చౌడవాడ సచివాలయానికి చెందిన వీఆర్వో తిరుమలరాజు అప్పలనరసింహరాజు అక్కడికక్కడే మృతిచెందారు. చింతపల్లిలో ఉద్యోగ బాధ్యతలు ముగించుకుని విజయనగరంలోని తన నివాసానికి బైకుపై వెళ్తున్న సమయంలో కుమిలి వద్ద రోడ్డుపై ఆగిఉన్న ట్రాక్టరును ఢీకొట్టారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు ఈయనను గుర్తించి వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందజేశారు. ఈ కార్యాలయ సిబ్బంది స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్‌కు సమాచారం అందజేశారు. వెంటనే రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అదే విధంగా స్థానిక ఎస్ఐ అక్కడకు చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతుడికి ఒక కుమారుడు, భార్య ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉంటున్నారు. ఈయన ఆకస్మిక మృతి పట్ల రెవెన్యూ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి చెందారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

బాడంగి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం పిండ్రంగివలస ఎల్‌సీ గేటు సమీపంలో దాదాపు 55 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్టు గుర్తించామన్నారు. రైలు ఢీకొని గానీ, రైలు నుంచి జారిపడి గానీ మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. మృతుడు తెల్ల టీషర్టు ధరించి ఉన్నాడని, దానిపై సర్దార్ వల్లభాయ్ పటేల్ ఫొటో, ఏక్తా దివస్ కొండాపడ బీజేపీ అని ఒరియా భాషలో రాసి ఉందన్నారు కాషాయం రంగు టవల్, పసుపు రంగు దుప్పటి, గులాబీ రంగు లుంగీ ధరించి ఉన్నాడన్నారు. చేతి సంచిలో చిల్లర పైసలు, బియ్యం ఉన్నాయన్నారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9490617089, 8309901038లను సంప్రదించాలని సూచించారు.

విశాఖలో యువకుడి ఆత్మహత్య

- మృతుడు విజయనగరం జిల్లా గుర్ల వాసి

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో జాతీయ రహదారికి ఆనుకుని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాల నుంచి విశాఖ వేలీ స్కూలుకు వెళ్లే మార్గంలో తుప్పల్లో చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా గుర్లకు చెందిన కె.దామోదరం (30) చోరీలు చేస్తుంటాడు. ఈ క్రమంలో అతడు ఓ కేసులో శిక్షణ అనుభవించి రెండు రోజుల కిందట విశాఖ కేంద్ర కారాగారం నుంచి విడుదల అయ్యాడు. ఇతడి తల్లిదండ్రులు హైదరాబాద్ ఉంటారు. మంగళవారం సాయంత్రం తమకు జూ సమీపంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం అందడంతో ఘటానా స్థలానికి చేరుకుని పరిశీలించామని, మృతుడు దామోదారంగా గుర్తించామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్టు చెప్పారు. అతడి ఆతహత్యకు కారణాలు తెలియలేదని, కుటుంబ సభ్యుల కు సమాచారం అందించినట్టు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

దాడిలో ఒకరికి గాయాలు

సంతకవిటి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సంతకవిటికి చెందిన చాపా రాంబాబు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన జనార్దనరావు ఐరన్ రాడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటనలో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై ఎస్ఐ ఆర్.గోపాలరావు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న రాంబాబును జనార్ధనరావు తిట్టాడు. ఎందుకు తిడుతున్నావని అడిగినందుకు జనార్దనరావు సమీపంలో ఉన్న ఐరన్ రాడ్‌తో రాంబాబు తలపై కొట్టాడు. దీంతో రాంబాబు స్పృహ కోల్పోయాడు. దీంతో జనార్దనరావు తన ఆటోలోనే రాంబాబును ఎంపీపీ పాఠశాల వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయాడు. అక్కడ పడిఉన్న రాంబాబును చూసి పాపినాయుడు అనే వ్యక్తి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ నుంచి రాంబాబు మెరుగైన చికిత్స కోసం రాజాంలోని ఓ ఆసుపత్రిలో చేరాడు. మంగళవారం రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ

గజపతినగరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గజపతినగరం పంచాయతీ శివారు గ్రామం ఎం.వెంకటాపురంలోని తనకు ఉన్న ఇంటి స్థలం తనకు అప్పజెప్పాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన తాడ్డి నానాజీ ఇటీవల గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొబ్బిలి ఆర్డీవో మోహనరావు మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి ఆ స్థలాన్ని పరిశీలించారు. గతంలో తహసీల్దార్ బి.రత్నకుమార్ పరిశీలన చేపట్టగా.. అది చంపావతి వంతెన గట్టు అని నిర్ధారించారు. దీంతో ఫిర్యాదుదారుడు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆర్డీవో వచ్చి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

శృంగవరపుకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నదని ఎంపీడీవో సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంటు, టైలరింగ్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, ఎంబ్రాయిడరీ, శారీ, పెయింటింగ్, జ్యూట్ బ్యాగుల తయారీ, అగరవత్తుల తయారీతో పాటు పుట్టగొడుగుల పెంపకం (స్త్రీ, పురుషులు), పురుషులకు కంప్యూటర్ హార్డ్‌వేర్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్, టూవీలర్ మెకానిక్, హౌస్ వైరింగ్, ఎల్ఎంవీ డ్రైవింగ్, రిఫ్రిజిరేటర్, ఏసీ, టెక్నీషియన్, సీసీ టీవీ ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్‌ల్లో శిక్షణ ఉంటుందన్నారు. విజయనగరం టీటీడీసీ మహిళ ప్రాంగణంలో ఇవ్వనున్న ఈ శిక్షణా కాలంలో వసతి, ఉచిత భోజనం కల్పిస్తారన్నారు. వివరాలకు 9959521662, 9985787820 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

దత్తిరాజేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో శతశాతం గెలుపే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎంపీపీ, టీడీపీ మండల ఇన్‌చార్జి కొండపల్లి కొండలరావు పిలుపునిచ్చారు. మంగళవారం కోమటిపల్లి పెట్రోల్ బంకు వద్ద గల ఫంక్షన్ హాల్‌లో టీడీపీ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, ఎన్నికల పరిశీలకుడు కర్రోతు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జిలు మిత్తిరెడ్డి ఈశ్వరరావు, పెద్దింటి మోహన్, టీడీపీ జనరల్ సెక్రటరీ చెల్లూరి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం

(ఐదో పేజీ తరువాయి)

232 డయాలసిస్ కేంద్రాలున్నాయి. కొత్త వాటితో ఆ సంఖ్య 239కు చేరుకోనుంది. అయితే ప్రస్తుతం ఏర్పాటు కానున్న కేంద్రాలు అత్యధికంగా గిరిజన ప్రజలకు ఉపయోగపడనున్నాయి. వీటిని ఏర్పాటు చేసే ఆసుపత్రులన్నీ గిరిజనులు ఎక్కువగా వైద్యానికి వస్తున్నవే. ఈ కేంద్రాలు అతి త్వరలో పని చేయనున్నాయి. పీపీపీ విధానంలో వీటి నిర్వహణ బాధ్యతను ఓ సంస్థకు అప్పగించారు. కాగా 2024-2025 ఆర్థిక సంవత్సరంలో డయాలసిస్ చేసుకున్న కిడ్నీవ్యాధి బాధితుల కోసం కూటమి ప్రభుత్వం రూ.164 కోట్లు వ్యయం చేసింది. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా రూ.110 కోట్లు, ప్రధాన మంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం కింద రూ.54 కోట్లు ఖర్చు చేసింది. ఇప్పుడు డయాలసిస్ కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయడం ద్వారా వ్యయ, ప్రయాసలు తప్పనున్నాయి.

● ఈ ప్రాంతాల్లో కిడ్నీ పాడైనవారంతా విశాఖ కేజీహెచ్, ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. కేజీహెచ్‌లో ఉచితంగా డయాలసిస్ చేస్తున్నప్పటికీ ప్రయాణ ఖర్చులు తప్పడం లేదు. రోగితో పాటు ఒకరిద్దరు ఉండాల్సి వస్తుంది. నెలలో రెండు నుంచి నాలుగు సార్లు వెళ్లాల్సి రావడంతో పేద, బడుగు వర్గాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో కొత్తగా డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావడంతో ఎంతో మంది పేదలకు ఖర్చుతో పాటు ప్రయాణం తప్పనుంది.

ఉద్యోగులకు ఊరట

(ఐదో పేజీ తరువాయి)

లీవు కానీ నష్ట సెలవులు కానీ పెట్టుకోవాల్సి వచ్చేది. కాగా చైల్డ్‌కేర్ సెల వులు పెట్టుకోవడానికి ఉద్యోగ విరమణ వరకూ కూటమి ప్రభుత్వం అనుమతించింది. అదే విష యాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రక టించారు. ఇది ఉద్యోగులకు భారీ ఉపశమన మే. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగుల్లో 47 శాతం మంది మహిళలే ఉన్నారు. 10,436 మంది వివిధ శాఖల్లో కొనసాగుతున్నారు. చైల్డ్‌కేర్ సెలవులు సర్వీసు మొత్తం వర్తింపజేయడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ శాఖకు మరింత ఉపశమనం..

సెలవులు లేని ఏకైక శాఖ పోలీస్ శాఖ. ఏడాది మొత్తం సెలవులు అనేవి స్వల్పం. అవి కూడా స్టేషన్ అధికారి అనుమతితోనే తీసుకోవాల్సి ఉంటుంది. వారాంతపు సెలవులు అనేవి ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. అయితే తమ ఎర్న్, సరెండర్ లీవులు ఇవ్వాలని పోలీస్ శాఖ ఉద్యోగులు కోరుతూ వస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. నవంబరులో 50 శాతం, జనవరిలో మిగిలిన 50 శాతం సరెండర్ లీవుల చెల్లింపులు చేయనున్నారు. జిల్లా పోలీస్ శాఖలో 2,500 మంది పనిచేస్తున్నారు. సెలవు దినాల్లో పనిచేస్తున్నందుకు సరెండర్ లీవులు మంజూరవుతాయి. ఆర్జిత సెలవులుగా భావించి నగదు రూపంలో మార్చుకోవచ్చు. ఈ లెక్కన పోలీస్ శాఖ ఉద్యోగులకు రూ.6 కోట్ల ప్రయోజనం చేకూరుతుందని ఉద్యోగ సంఘాల నేతల అంచనా.

ఆస్తి పన్ను మినహాయింపు..

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను నుంచి మినహాయింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, ముఖ్య పట్టణాల్లో ఉద్యోగ సంఘాల భవనాలు ఉన్నాయి. విజయనగరంలో ఏపీఎన్జీవో, రెవెన్యూ పింఛనుదారుల సంఘం, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం, సర్వే, వ్యవసాయ, విద్యుత్ శాఖలకు చెందిన కార్యాలయాలు ఉన్నాయి. స్థానిక రెవెన్యూ అసోసియేషన్ భవనానికి ఆరు నెలలకు రూ.12,500 వరకూ పన్ను చెల్లించేవారు. ఇప్పుడు ఉపశమనం కలగనుంది.

శుభ పరిణామం..

రాష్ట్ర ప్రభుత్వం డీఏ మంజూరు చేయడం శుభ పరిణామం. ఏళ్ల తరబడి ఉద్యోగులు నాలుగు డీఏల కోసం ఎదురుచూస్తూ వచ్చారు. కనీసం రెండు డీఏలు ప్రకటిస్తామని భావించాం. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వం నుంచి వచ్చిన విన్నపాల మేరకు ఒక్క డీఏకు అంగీకరించారు. అయినా సరే కొంత ఉపశమనం.

-శ్రీధర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు, ఏపీఎన్జీవో సంఘం

చాలా మంచి నిర్ణయం..

చైల్డ్‌కేర్ సెలవులు ఉద్యోగుల పదవీ విరమణ వరకూ వర్తింపజేయడం మంచి విషయం. ఉద్యోగుల్లో మహిళలే ఎక్కువగా ఉన్నారు. కుటుంబంలో వారి పాత్ర కీలకం. ఇటు ఉద్యోగ విధులు చూడాలి. అటు కుటుంబాన్ని చూసుకోవాలి. కుటుంబంలో ఏ ఒక్కరికీ బాగాలేక పోయినా.. అనారోగ్యానికి గురైనా సెలవు పెట్టాల్సి వస్తుంది. చైల్డ్‌కేర్ సెలవులను వినియోగించే సమయాన్ని 18 ఏళ్ల నుంచి సర్వీసు మొత్తానికి పెంచడం ఆహ్వానించదగ్గ విషయం.

-పి.రఫెల్, జిల్లా కార్యదర్శి, నేషనల్ మజ్దూర్ అసోషియేషన్

పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం

(ఐదో పేజీ తరువాయి)

పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని స్మృతి వనంలో అమర వీరులకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ విధుల నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వారు చిరస్థాయిగా నిలుస్తారన్నారు. వారి సాహసం సదా స్ఫూర్తిదాయకమని చెప్పారు. జిల్లా న్యాయాధికారి ఎం.బబిత మాట్లాడుతూ దేశంలో మావోయిజం తీవ్రంగా ఉన్న సమయంలో మావోయిస్టులతో వీరోచిత పోరాటం చేసి ఎంతోమంది పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని గుర్తుచేశారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ పోలీస్, పారా మిలటరీ దళాలు శాంతిభద్రత పరిరక్షణలో సంఘవిద్రోహ శక్తులతో పోరాటాలు చేయటంతోనే తీవ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టి నేడు మనమంతా స్వేచ్ఛగా, శాంతియుతంగా ఉండగలుగుతున్నామన్నారు. అనంతరం మావోయిస్టుల కాల్పుల్లో అమరులైన ముద్దాడ గాంధీ, చిట్టిపంతుల చిరంజీవి, షేక్ ఇస్మాయల్, శ్రీరాములు, సూర్యనారాయణ త్యాగాలను స్మరించుకుంటూ అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు, న్యాయాధికారులు మీనాదేవి, నాగమణి, సైనిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్ శర్మ, ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మరో అడుగు

(ఐదో పేజీ తరువాయి)

కేటాయించింది. అయితే వైసీపీ ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీని మెంటాడ మండలానికి తరలించింది. అక్కడ మళ్లీ భూములను సేకరించింది. ఈ నేపథ్యంలో గిరిజన యూనివర్సిటీ కోసం సేకరించిన భూములను గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కేటాయించాలని హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పలుమార్లు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ క్రమంలో హోంశాఖ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. భూములకు సంబంధించి ఎకరా 27 లక్షల రూపాయలుగా నిర్ణయించింది. గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రానికి అప్పగించే భూముల ధరను రూ.139 కోట్ల 47 లక్షల 66 వేలుగా నిర్ణయించి మార్కెట్ ధరకు ఇవ్వడానికి అంగీకరించింది. ఈమేరకు మంగళవారం జీవో విడుదల చేసింది. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి పేరుతో ఈ జీవోను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులతో త్వరలోనే గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి అవసరమైన పనులు ప్రారంభమవుతాయని అంతా భావిస్తున్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నం చేసిన న్యాయవాదితో పాటు ఐపీఎస్ అధికారి పూర్‌కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ పోరాటసమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో మంగళవారం అంబేద్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబయ్య, సీనియర్ న్యా యవాది ఎస్.విల్సన్‌బాబా మాట్లాడారు రెండు ఘటనలను వారు ఖండించారు. నిందితులకు మద్దతు పలుకుతున్న వారందరినీ అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎండ గోపాలరావు, రామారావు, రామస్వామి, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 13న గుంటూరులో జాబ్‌మేళా

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో డిసెంబరు 13న బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను పేద బ్రాహ్మణ యువత వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బేబీనాయన సూచించారు. స్థానిక దర్బారు మహల్‌లో మంగళవారం ఉత్తరాంధ్ర బ్రాహ్మణ సమాఖ్య కార్యదర్శి ఇనుగంటి రాకేశ్ ఆధ్వర్యంలో ఆయన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. పేద బ్రాహ్మణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు వేల్పూరి గంగరాజు, ఇనుగంటి సురేష్‌కుమార్, పుల్లెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి కోటలో ప్రజాదర్బార్

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటలో మంగళవారం ఎమ్మెల్యే బేబీనాయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు ఆధ్వర్యంలో ఏఎంసీ కలాసీలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దాంతో ఆయన మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌తో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం స్థానిక కోటలో ఎమ్మెల్యే బేబీనాయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బేతనపల్లి దేవకికి రూ.4 లక్షలు, చింతాడ సత్యప్రకాశ్‌కు రూ.1.50 లక్షలు, బగాది పోలయ్యకు రూ.2 లక్షలు, చిరికి సతీష్‌కుమార్‌కు రూ.3 లక్షలు, సుంకర సాత్వికకు రూ.లక్ష చొప్పున చెక్కులను ఆయన అందజేశారు.

జీవో 60, 61లను సవరించండి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేత జేసీ రాజు

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవో 60, 61లను సవరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్ చేశారు.. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 జనవరి నుంచి ఈ నెలాఖరు వరకు చెల్లించాల్సిన డీఏ బకాయిలపై ప్రభుత్వం పెట్టిన మెలిక హాస్యాస్పదంగా ఉందన్నారు. పదవీ విరమణ లేదా మృతి చెందితే వారి వారసులకు చెల్లిస్తామని చెప్పడం దారుణమన్నారు. ఇది ఉద్యోగుల పట్ల ముమ్మాటికీ వివక్ష అన్నారు. జీవోలోని 11, 12 పేరాలను పూర్తిగా తొలగించాలన్నారు. నాలుగు డీఏ బకాయిలకు ఒక్కటే చెల్లిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు జీసీహెచ్‌జి శర్మ, చిన్నారావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. ● యూటీఎఫ్ రాష్ట్ర నేత కె.విజయగౌరి, ఎస్టీయూ నేత కె.జోగారావు మంగళవారం వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో జీవో 60, 61లను సవరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల పట్ల ప్రభుత్వం చేస్తున్న తీపి ప్రకటనలన్నింటినీ ఆచరణలో నిజం చేసి చూపించాలన్నారు.

ఉద్యోగులపై వివక్ష విడనాడండి

రామభద్రపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష విడనాడాలని ఫ్యాప్టో నాయకులు జేసి రాజు అన్నారు. మండల రిసోర్స్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నాలుగు కరువు భత్యాలు పెండింగ్‌లో ఉంచి ఇచ్చిన డీఏ బకాయి చెల్లింపుపై జాప్యం ప్రదర్శించడం తగదన్నారు. డీఏ జీవోలను సవరించాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు చెల్లింపుల జీవోలు లేకపోవడం, పింఛనుదారులకు 2027-28 సంవత్సరంలో 12 వాయిదాల్లో డీఏ బకాయిలు చెల్లిస్తామని పేర్కొనడం సమంజసం కాదన్నారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బొప్పే రవికుమార్ మాట్లాడుతూ జీవో 60, 61లను తక్షణమే సవరించాలన్నారు. ఉద్యో గులకు డీఏ బకాయిలను వారి పీఎఫ్ ఖాతాల్లో వెంటనే జమచేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు, పింఛనుదారులకు డీఏలను నగదు రూపంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు వి.అప్పారావు, కర్రి శ్రీనివాసరావు, రెడ్డి వేణు, వెంకటరావు, రామారావు, శాంతి కుమారి, కృష్ణంనాయుడు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలూరిపై తప్పుడు ప్రచారం తగదు

బొబ్బిలి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరు బాబూరావుకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై ఆ పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్తలు మంగళవారం బొబ్బిలి పోలీసుస్టేషన్‌లో సీఐ కటకం సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు గంగాధర్, రేవళ్ల కిరణ్, రవి తదితరులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అత్యంత కీలకంగా సేవలు అందజేస్తున్న పాలూరు పార్టీలో కొనసాగితే తమ ఉనికికి ప్రమాదం భావించి రాజకీయ కుట్రతో ఆయనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసి పారిపోయినట్లు వ్యక్తిత్వ హననం చేస్తున్నారన్నారు. ఈ కుట్ర వెనుక ఉన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు ఉన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

బొబ్బిలి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాల మైదానంలో మంగళవారం బొబ్బిలి డివిజన్ స్థాయి అండర్ 14, 17 బాలబాలికల వాలీబాల్ జిల్లా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. బొబ్బిలి రెవిన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బుధవారం భోగాపురంలో జరగనున్న జిల్లా స్థాయి జట్టు ఎంపిక పోటీలో వీరు పాల్గొంటారని డివిజనల్ క్రీడా ఇన్‌చార్జి, ఫిజికల్ డైరెక్టర్ నల్ల వెంకటనాయుడు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శివున్నాయుడు, వెంకటరమణ, సింహాచలం, ఏబీసీ నాయుడు, మురళి, వెంకటరావు పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారం రూ.40 కోట్లు

(ఐదో పేజీ తరువాయి)

పెట్టింది. సుమారు రూ. 40కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు మార్కెట్ వర్గాల అంచనా. జిల్లాలో 9 మంది రెగ్యులర్ బాణసంచా ట్యాక్స్ చెల్లింపుదారులతో పాటు 46 మంది తాత్కాలిక పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. అంతా కలిపి అధికారికంగా రూ.12కోట్ల టర్నోవర్ మాత్రమే చూపించారు. క్లోజింగ్ స్టాక్, ఎంఆర్‌పీ లొసుగులను ఉపయోగించి బురిడీ కొట్టించినట్లు సమాచారం. మరోవైపు సరిహద్దుల్లో చెక్ పోస్టులు తొలగించడంతో ఈ- వే బిల్లులు లేకుండానే లేదా తక్కువ విలువ చూపించిన పత్రాలతో రాష్ట్రాలు దాటించి బాణసంచాను అక్రమంగా తీసుకొచ్చి లబ్ధి పొందారు. ఇది వరకు ఏటా వాణిజ్యపన్నుల శాఖాధికారులు దీపావళి ముందు రోజు ఒకసారి, దీపావళి తరువాత రోజు ఒకసారి తమ పరిధిలో ఉన్న దుకాణదారుల స్టాకు వివరాలు నమోదు చేసుకొనే పద్ధతి అమల్లో ఉండేది. ఇప్పుడు లేదు. దీపావళి సమయంలో నగదు లావాదేవీలను పూర్తిగా పర్యవేక్షించడానికి వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు తగిన సిబ్బంది లేక పోవటంతో వ్యాపారులకు మరింత కలిసొచ్చింది.

అధ్వానంగా రామన్నదొరవలస రోడ్డు



గోతులతో రామన్నదొరవలస- డొంగురువలస రోడ్డు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రామన్నదొరవలస నుంచి డొంగురువలసకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డు యావత్తూ గోతుల మయమైంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు గోతుల్లో చేరింది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా నిత్యం వందలాది వాహన రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టక పోవడంతో రూపు కోల్పోయింది. ఇకనైనా పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.

మహాసభలను జయప్రదం చేయండి



కోమటిపల్లిలో సీఐటీయూ నాయకుల ప్రచారం

బొబ్బిలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు ఐదు రోజుల పాటు తలపెట్టిన సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు పి.శంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కోమటిపల్లి, కలవరాయి, చింతాడ, పక్కి, పిరిడి తదితర గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శ్రమజీవులు ఎవ్వరికీ కనీస వేతనాలు సామాజిక రక్షణ, ఉద్యోగ భద్రత లేదన్నారు. ఇదే విషయంపై స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట 30న ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నిర్మల, లక్ష్మి, మధ్యాహ్న భోజనం కార్మికులు పాల్గొన్నారు.

పెంట ఉన్నత పాఠశాలలో చెకుముకి పోటీలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి పాఠశాల స్థాయి పరీక్షను మంగళవారం నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థు లు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల నుంచి 10 మంది విద్యార్థులు ఆయా తరగతుల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు హెచ్‌ఎం వేణు గోపాలరావు బహుమతులు అందజేశారు. వీరు మండల స్థాయి లో పోటీలకు హాజరవుతారని హెచ్‌ఎం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దీపావళి

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో సోమవారం రాత్రి దీపావళి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కంచర వీధిలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, షిర్డీసాయి మందిరంలో ఓంకారం, స్వస్తిక్ ఆకృతిలో దీపారాధన చేశారు.

వేతన బకాయిలు చెల్లించండి

రామభద్రపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోని 12 నెలల వేతన బకాయిలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లు కోరారు. మంగళవారం ఎంపీడీవో రత్నంను రొంపల్లి పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు సొండి తవుడు, ముదిలి తవుడు, లింగాల రాములు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. వేతనాలు చెల్లించక పోవడం వల్ల కుటుంబ పోషణకు కష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు అందించి ఆదుకోవాలని కోరారు.

నేడు పశువైద్య శిబిరం

రామభద్రపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నాయుడువలసలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రామభద్రపురం పశువైద్యాధికారి అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. గొడ్డు మూతు, ఎదకురాని పశు వులకు చికిత్స చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఇంటిలోకి చొరబడిన పాము



నాగుపామును విడిచిపెడుతున్న దృశ్యం

బొబ్బిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదోవార్డు అగురువీధిలో మంగళవారం మధ్యాహ్నం మామిడి ప్రసాదరావు ఇంటిలోకి సుమారు ఐదున్నర అడుగుల నాగుపాము చొరబడింది. దాంతో ప్రసాదరావు కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. పాములు పట్టే యువకులకు సమాచారం అందజేశారు. దాంతో వారు పామును పట్టుకుని పట్టణానికి దూరంగా విడిచిపెట్టారు. ఎవరికీ ఎటువంటి ముప్పు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.